క్లుప్తంగా

హుషారుగా ఉత్తరాంధ్ర స్థాయి ఎడ్లబళ్ల పోటీలు



పోటీల్లో దౌడు తీస్తున్న ఎడ్లు

మాడుగుల రూరల్: మండలంలో ఎం.కోట పాడు, ఎం.కె. వల్లాపురం గ్రామాల ఆరాధ్య దైవం వీరాంజనేయ స్వామి తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారిని ఉదయం నుంచి భక్తులు తమలపాకలతో పూజించి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం స్థానిక పీఏసీఎస్ ఆవరణలో దాతల సహకారంతో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్వామి వారిని మార్కెట్ కమిటీ చైర్మన్ శానాపతి కొండలరావు, సర్పంచ్‌లు శానాపతి శేషపణి, కోట్ని లక్ష్మి, ఉప సర్పంచ్‌లు శానాపతి గంగాధర్, కరణం రాము, మాజీ సర్పంచ్ కోట్ని శ్రీరామూర్తి, తదితరులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన 30 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. వీటిని తిలకించడానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

తాగునీటి బోరు పనులు ప్రారంభం



బోరు రిగ్గు పనులు చేయిస్తున్న యూత్ లీడర్ బాలరాజు

రోలుగుంట: వైబీ పట్నంలో పోతురాజుబాబు గుడి వద్ద తాగునీటి బోరు ఏర్పాటుకు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ రూ. లక్ష మంజూరు చేశారు. ఈ నిధులతో వైఎస్సార్‌సీపీ మండల యూత్ కమిటీ నాయకుడు కొండపల్లి బాలరాజు మంగళవారం బోరు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ గుడి వద్ద భక్తుల నీటి సమస్యను ప్రభుత్వ విప్ ధర్మశ్రీ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే బోరు మంజూరు చేశారన్నారు. ఆలయ కమిటీతోపాటు ఆయన ధర్మశ్రీకి కృతజ్ఞతలు తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



పరీక్ష సామగ్రిని అందజేస్తున్న ఎంఈవో పడాల్‌దాస్, రమణ

దేవరాపల్లి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఎంఈవో–1 బి. పడాల్‌దాస్ తెలిపారు. పెదనందిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతికి చెందిన 12 మంది విద్యార్థులకు జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ సభ్యుడు, జేసీఎస్ మండల కన్వీనర్ కేవీ రమణ, ఎంఈవో పడాల్‌దాస్ పంపిణీ చేశారు. వీటిని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక మండలాధ్యక్షుడు కొరుపోలు శ్రీను తన సొంత సొమ్ముతో సమకూర్చారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ విద్యార్థులంతా సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళిక బద్ధంగా చదివి అత్యధిక మార్కులు సాధించాలన్నారు. హెచ్‌ఎం బొద్దు దేముడునాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేడుకగా హైస్కూళ్ల వార్షికోత్సవం



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

గొలుగొండ: చోద్యం, జోగుంపేట జెడ్పీ హైస్కూళ్ల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయా స్కూళ్లలో విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా చోద్యం హైస్కూల్ హెచ్‌ఎం రత్నాజీ మాట్లాడుతూ మంచి భవిష్యత్ కోసం విద్యార్థులు చిన్నతనం నుంచి విద్యపై ఆసక్తి కలిగి ఉండాలని తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం మార్కులతో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి, రాష్ట్ర శెట్టిబలిజ డైరెక్టర్ రాజు, లింగంపేట సర్పంచ్ సంతోష్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఎం.కోడూరులో రోగులకు రక్తపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



ఎం.కోడూరులో మాట్లాడుతున్న ఎంపీపీ రాజారామ్



మంగళాపురంలో రోగులకు మందులు అందిస్తున్న జెడ్పీటీసీ రాంబాబు

అందరి ఆరోగ్యమే సీఎం ధ్యేయం

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ
- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన



చోడవరం : జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: రాష్ట్రంలో అందరి ఆరోగ్యమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ప్రభుత్వ విప్ కరణం, ఎమ్మెల్యే ధర్మశ్రీ తెలిపారు. చోడవరం సచివాలయం–1 పరిధి యూపీ స్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ఆధ్వర్యంలో ఐదుగురు వైద్యుల బృందం 269 మందికి రోగులను పరీక్షించింది. శిబిరాన్ని సందర్శించిన ప్రభుత్వ విప్ కరణం ఇక్కడ అందిస్తున్న వైద్య సేవలు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉండటంతోపాటు వారికి ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే వైద్యం అందించాలన్న ఎంతో మంచి ఆశయంతో ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చేపట్టారన్నారు. అభివృద్ధి సంక్షేమంతోపాటు ప్రజల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకున్నది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నారాయణరావు, సర్పంచ్ బండి నూకాలమ్మశ్రీను, వార్డు మెంబర్లు చిటికెల నాగేష్, పట్టణాధ్యక్షుడు దేవరపల్లి సత్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల రమేష్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు బొగ్గ శ్యామల, తదితరులు పాల్గొన్నారు.



ఎం.బెన్నవరంలో సురక్ష బుక్‌లెట్లు ప్రదర్శిస్తున్న ప్రజాప్రతినిధులు అధికారులు

మాడుగుల రూరల్: గ్రామస్థాయిలో వైద్య సేవలందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ తెలిపారు. మంగళవారం ఎం.కోడూరులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యులు ప్రసాదుపాత్రుడు, లీలాప్రసాదు, ప్రత్యేక వైద్యులు 320 మందిని పరీక్షించారు. ఆప్తాలమిస్టు సహాయకురాలు నాగలక్ష్మి కంటి రోగులను పరీక్షించారు. మండల పంచాయతీ విస్తరణాధికారి మీనాకుమారి, సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గొల్లవిల్లి రాజేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, చింతా వెంకటరమణమూర్తి, కార్యదర్శి కోరుకొండ జగదీశ్, సీహెచ్‌వో సిహెచ్ పుష్పమ్మ పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: మంగళాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష– 2 శిబిరాన్ని జెడ్పీటీసీ దొండా రాంబాబు, సర్పంచ్ కంటే పద్మరేఖ వెంకట్ మంగళవారం ప్రారంభించారు. వైద్యులు మౌనిక, అరుణ్‌కుమార్, చందన, ఉమామహేశ్వరరావు 362 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. మంగళాపురం, శివారు గ్రామం కుముదాంపేట నుంచి రోగులు హాజరయ్యారు. వీరిలో 25 మందికి తీవ్ర అనారోగ్య సమస్యలున్నట్లు గుర్తించి మెరుగైన వైద్య సేవలకు ఎంపిక చేసినట్లు వైద్యురాలు మౌనిక తెలిపారు. ఎంపీటీసీ పత్తి అప్పలనరసమ్మ కృష్ణ, ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త రాధ, ఏఎన్‌ఎం రవణమ్మ పాల్గొన్నారు.



శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ జయమ్మ

రావికమతం: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం–2 మంగళవారం కొత్తకోటలో నిర్వహించారు. చోడవరం సీహెచ్‌సీ గైనిక్ వైద్యనిపుణురాలు స్మృతి, ఎండీ మల్లికార్జునరావు, ఆప్తాలమిస్టు ఆర్.సురేష్ తోపాటు కొత్తకోట పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీరజని పాల్గొన్నారు. మొత్తం 428 మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కొత్తకోట పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి పాతాళ రామారావు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న ప్రత్యేక వైద్య నిపుణురాలు స్మృతి

నాతవరం: ఎం.బెన్నవరం సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు శిరుసుపల్లి నర్సింగరావు, సర్పంచ్ మార్తి నాగమణి, ఎంపీటీసీ తమరాన లోవకృష్ణ ప్రారంభించారు. ఈ శిబిరంలో 290 మంది రోగులను వైద్యాధికారులు ఎం.రాజేష్‌నాయుడు, ప్రసన్న పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం నర్సింగరావు మాట్లాడుతూ ఇప్పుడున్న సంక్షేమ పథకాలు యధావిధిగా అమలు కావాలంటే మరలా సీఎం జగన్‌తోపాటు ఎమ్మెల్యే గణేష్‌ను గెలిపించాలన్నారు. ఎంఈవో–2 కామిరెడ్డి వరహాలబాబు, పార్టీ మండల నాయకుడు ఇట్టంశెట్టి గోవిందరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీను పాల్గొన్నారు.

చీడికాడ: బైలపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష –2 శిబిరాన్ని ఎంపీపీ కురచా జయమ్మ ప్రారంభించారు. ఈ శిబిరంలో చీడికాడ వైద్య సిబ్బందితో పాటు ఇద్దరు స్పెషలిస్టు డాక్టర్లు 330 మంది రోగులను పరీక్షించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జె.గంగతల్లి, ఎంపీడీవో ఉమామహేశ్వరి, వైఎస్సార్‌సీపీ యూత్ విభాగం మండలాధ్యక్షుడు గొల్లవిల్లి స్వామినాయుడు పాల్గొన్నారు.

సీఎంకు ఘన స్వాగతం





వాణిజ్యవేత్తల సదస్సుకు విశాఖ వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలుకుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ. ఎమ్మెల్యే ఉమాశంకర గణేష్

రెండోసారి జగన్ సీఎం కావాలని ప్రత్యేక పూజలు



రావాలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న బూడి రమణమ్మ, తదితరులు

కె.కోటపాడు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి సీఎం కావాలని, మాడుగులలో మూడోసారి వైఎస్సార్‌సీపీ గెలవాలని కోరుతూ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ వేడుకున్నారు. మంగళవారం స్థానిక రావాలమ్మ, మరిడిమాంబ అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పేద కుటుంబాల్లో జీవన ప్రమాణాలను పెంచే విధంగా సంక్షేమ పాలనను అందించిన సీఎం జగన్ మరలా ముఖ్యమంత్రి కావాలన్నారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, కె.కోటపాడు, దేవరాపల్లి, చీడికాడ మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు రెడ్డి జగన్‌మోహన్, కిలపర్తి రాజేశ్వరి, కర్రి సత్యం, లాలం శారద, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వీడ్కోలు వేడుక



ఆకట్టుకున్న విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

రావికమతం: స్థానిక హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుక ఉత్సాహంగా జరిగింది. పేరెంట్స్ కమిటీ చైర్మన్ ప్రసాద్, హెచ్‌ఎం మల్లికార్జునరావుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. పదో తరగతి పరీక్షలు శతశాతం ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.



ఎం.కోడూరు పాఠశాలలో మాట్లాడుతున్న రాజేష్

మాడుగుల రూరల్: పదో తరగతిలో మంచి ఉత్తీర్ణత సాధనకు విద్యార్థులు శ్రమించాలని ఎం.కోడూరు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గొల్లవిల్లి రాజేష్ తెలిపారు. హెచ్‌ఎం రాపర్తి కనకరావు అధ్యక్షతన ఎం. కోడూరు హైస్కూలులో పది విద్యార్థుల వీడ్కోలు వేడుక మంగళవారం ఉత్సాహంగా నిర్వహించారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ కోన అన్నపూర్ణతో కలిసి వారు మాట్లాడారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నాయకులు పడాల అప్పలనాయుడు, కోన అప్పలనాయుడు, సీఆర్పీ బి.హరికృష్ణ పాల్గొన్నారు.

రూ.28.30 లక్షల తుఫాన్ నష్ట పరిహారం



ఏవో రూప

రావికమతం: గతేడాది చివర్లో ఏర్పడ్డ మిచాంగ్ తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులకు రూ.28.30 లక్షల పరిహారం వారి ఖాతాల్లో జమ కానుందని ఏవో రూప మంగళవారం తెలిపారు. మిచాంగ్ తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు మండలంలో 27 గ్రామాల్లో 907 మంది రైతులకు చెందిన 166.514 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లిందన్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఆయా బాధిత రైతుల ఖాతాల్లో నష్ట పరిహారాన్ని రెండు రోజుల్లో జమ చేయనుందన్నారు.

వైభవంగా గంగాదేవి పండగ

గొలుగొండ: సాలికమల్లవరంలో గంగాదేవి పండగ మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు భారీ విద్యుత్ అలంకరణతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. బాణసంచా కాల్చారు. ఉదయం నుంచి అమ్మవారి ఆలయం వద్ద భక్తులు కానుకలు సమర్పించుకున్నారు. వీరికి ఇబ్బందులు లేకుండా ఎస్ఐ బి. కృష్ణారావు ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులు

మాడుగుల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సత్యవేణి



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి సత్యవేణి

కె.కోటపాడు: సార్వత్రిక ఎన్నికలు దృష్ట్యా మండలంలోని 62 పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలని మాడుగుల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.వి.సత్యవేణి తెలిపారు. మంగళవారం కె.కోటపాడులో పోలింగ్ సెక్టార్, రూట్ అధికారులతోపాటు మండల స్థాయి అధికారులు, బీఎల్వోలతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీరు, ర్యాంపుల ఏర్పాటు సౌకర్యాలపై బీఎల్వోలను అడిగి తెలుసుకున్నారు. ఈ నెలాఖరు వరకూ గ్రామాల్లో మాక్ పోలింగ్ నిర్వహించాలని సూచించారు. సార్వత్రిక ఎన్నికల నామినేషన్‌కు పది రోజుల ముందు వరకూ ఫారం–6, 7, 8 దరఖాస్తులు స్వీకరించొచ్చన్నారు. తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ, నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రాజా, డిప్యూటీ తహసీల్దార్ డి.రమేష్ పాల్గొన్నారు.

సీఎం సభకు భారీగా తరలిరావాలి

మాకవరపాలెం: అనకాపల్లిలో ఈ నెల 7న సీఎం సభను విజయవంతం చేయాలని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడుతూ చేయూత నాల్గో విడత కార్యక్రమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతున్నారన్నారు. మండలంలోని కార్యకర్తలు, నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలన్నారు. డీసీసీబీ మాజీ డైరెక్టర్ పెట్ల భద్రాచలం, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీను పాల్గొన్నారు.

చీడికాడ: అనకాపల్లి మండలం పిసినిగాడ వద్ద సీఎం సభను విజయవంతం చేయాలని ఎంపీపీ కురచా జయమ్మ, నియోజకవర్గ ప్రత్యేకాధికారి బి. మహేశ్వర రెడ్డి కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, వెలుగు, సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. ప్రతి మూడు పంచాయతీలకు ఒక బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమామహేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, వెలుగు యాంకర్ పర్సన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయస్వామి తీర్థం

దేవరాపల్లి: కొత్తూరు ముత్యాలమ్మపాలెంలో అభయాంజనేయస్వామి తీర్థ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి గ్రామస్తులు తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచ్ గంధం రామకృష్ణ, ఎ. కొత్తపల్లి, మామిడిపల్లి సర్పంచ్‌లు చింతల సత్య వెంకటరమణ, కర్రి సూరినాయుడు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలను జెడ్పీటీసీ, సర్పంచ్ రామకృష్ణ ప్రారంభించారు. అనంతరం విజేతలకు వరుసగా రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేల చొప్పున బహుమతులను ప్రదానం చేశారు.

చిన అప్పనపాలెంలో ఘనంగా పైడితల్లమ్మ పండగ

బుచ్చెయ్యపేట: చిన అప్పనపాలెంలో మరిడిమాంబ పండగ ఘనంగా నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు, ఘటాల ఊరేగింపు సాగింది. రాష్ట్రంతోపాటు తెలంగాణ, తమిళనాడు, ఒడిశా తదితర ప్రాంతాల్లో పనులు కోసం వెళ్లిన వారంతా వచ్చి తమ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దిబ్బిడి, వడ్డాది, గొన్నవానిపాలెం, పి. భీమవరం, పోలేపల్లి తదితర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రాత్రికి డప్పులు, వాయిద్యాలు, సన్నాయి మేళతాళాలు, నేల డాన్స్‌లతో సాగిన సంబరం అంబరాన్ని తాకింది. ఆలయం వద్ద భారీ మందుగుండు సామగ్రి కాల్చివేత, మిరుమిట్లు గొలిపే విద్యుత్ లైటింగ్ అలంకరణ భక్తుల్ని ఆకట్టుకుంది. రాత్రికి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జెడ్పీటీసీ దొండా రాంబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, సర్పంచ్ కోవెల ఈశ్వరరావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

గునుపూడిలో పరదేశమ్మ పండగ

నాతవరం: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పరదేశమ్మ పండగను మంగళవారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచి మహిళలు క్యూలో నిల్చొని అమ్మవారికి పసుపు కుంకుమ, చీర రవికె ముక్క సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పండగ సందర్భంగా గ్రామమంతా విద్యుత్ లైటింగ్‌తో అలంకరించారు. ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ధర్మశ్రీని భారీ మెజార్టీతో గెలిపిద్దాం

- వైఎస్సార్‌సీపీ రోలుగుంట మండలాధ్యక్షుడు వెంకటరామన్



మట్లాడుతున్న మండలాధ్యక్షుడు వెంకటరామన్

రోలుగుంట: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీని అధిక మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని, అందుకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొర్లె వెంకటరామన్ కోరారు. మంగళవారం ఉదయం కొంతలంలో మాజీ సర్పంచ్ కుంచంగి హరిబాబు, మధ్యాహ్నం జె. నాయుడుపాలెంలో సర్పంచ్ బగుడు వెంకటరమణ అధ్యక్షతన మేము సిద్ధం, నా బూత్ సిద్ధం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న పార్టీ అధ్యక్షుడు, చోడవరం నాయకుడు జయ్‌దేవ్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం నవరత్నాలు ప్రవేశ పెట్టి వారి ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించారన్నారు. ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. దీన్ని గుర్తించి రెండోసారి సీఎం జగన్‌ను గెలిపించాలని కోరారు. మన వెన్నంటే ఉంటున్న కరణం ధర్మశ్రీని అధిక మెజార్టీతో గెలిపించడానికి ప్రతి ఒక్కరూ రానున్న 43 రోజులు కష్టపడి పని చేయాలన్నారు. ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ శెట్టి సత్యనారాయణమూర్తి, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ శానాపతి సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం చేయొద్దు



మాట్లాడుతున్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి

నాతవరం: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేయొద్దని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి తెలిపారు. ఆయన అధ్యక్షతన మండల పరిషత్ సమావేశంలో సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ముందుగా గత సమావేశంలో సభ్యులు అడిగిన సమస్యలపై ఎంత వరకు పరిష్కరించారనే విషయాలను ఎంపీడీవో జాగారపు రాంబాబు వివరించారు. తర్వాత శాఖల వారీగా మండల వ్యాప్తంగా చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చించారు. పెదగొలుగొండపేటలో కాంట్రాక్టరు ఇష్టానుసారంగా విద్యుత్తు స్తంభాలు వేస్తున్నారని సర్పంచ్ మిరపల వెంకటరమణ, ఎంపీటీసీ తమరాన సత్యనారాయణ ఆరోపించారు. రాజుపేట అగ్రహారంలో హెల్త్ క్లినిక్ పేరిట వచ్చిన సిమెంటు బినామీ పేరు మీద మార్చేశారని సర్పంచ్ అచ్చియ్యనాయుడు, ఎంపీటీసీ సత్యనారాయణ నిలదీశారు. దీనిపై క్షేత్రస్థాయిలో విచారణ చేయాలని ఎంపీపీ సంబంధిత అధికారికి సూచించారు. గుమ్మడిగొండలో పలు సమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ శెట్టి నూకరాజు వాపోయారు. వీటితోపాటు పలు సమస్యలు సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేక్ రజాక్ తన రాజీనామా పత్రం ఎంపీడీవో రాంబాబుకు అందజేశారు. ఎమ్మెల్యే గణేష్, పార్టీ శ్రేణుల వల్ల తనకు ఎలాంటి ఇబ్బందిలేదన్నారు. కేవలం మండలంలో కొంతమంది అధికారులు చేస్తున్న పనులపై విసిగి చెంది రాజీనామా చేస్తున్నాన్నారు. ఇటీవల ఆరోగ్యం సహకరించక ఈ నిర్ణయం తీసుకున్నాన్నారు. వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు శిరుసుపల్లి నర్సింగరావు, గన్నవరం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గొర్లె వరహాలబాబు, ఎంఈవో తాడి అమృత్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం, V.మాడుగుల

రేఖా నెం.9/2024 తే. 05-03-2024ది

బహిరంగ వేలం మరియు టెండర్ ప్రకటన

విశాఖపట్నం జిల్లా V.మాడుగుల మండలం V.మాడుగుల గ్రామ పంచాయతీ ఈ దిగువన పొందుపర్చిన షెడ్యూల్ 1లో ఉదహరించిన వాటికి టెండర్లు మరియు షెడ్యూలు 2లో ఉదహరించిన వాటికి బహిరంగ వేలము నిర్వహించబడును. తే.11-03-2024ది సోమవారం ఉదయం 9 గంటల వరకు షెడ్యూలు 1లో ఉదహరించిన ఐటమ్స్‌కు సీలువేసిన టెండర్లు తీసుకొనబడును. దాఖలైన సీలు టెండర్లు అదేరోజు ఉదయం 10.30 గంటలకు తెరవబడును. అదేరోజు ఉదయం 11 గంటల నుండి షెడ్యూలు 2లో ఐటములకు బహిరంగ వేలము నిర్వహించబడును. సదరు వేలం V.మాడుగుల మండలం శ్రీ EO (PR&RD) వారి సమక్షంలో బహిరంగ వేలము నిర్వహించబడును. షెడ్యూలు 1లో పొందుపర్చిన ఐటమ్స్‌కు ధరావత్తు టెండర్లు దాఖలు చేయుటకు ముందుగా నగదు రూపంలో చెల్లించవలెను. టెండర్లు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ క్రింది సంతకందారుచే కానీ వారి అనుమతి పొందిన వారిచే కానీ సీలు టెండర్లు స్వీకరించబడును లేదా వాయిదా వేయబడును. మిగతా వివరములు కార్యాలయ పనివేళలలో తెలుసుకొనవచ్చును.

షెడ్యూలు 2లో ఉదహరించిన ప్రకారం ధరావత్తులు DD/ నగదు రూపంలో చెల్లించగలరు. బహిరంగ వేలంపాటలో పాల్గొనదలచిన వారు శ్రీ తహశీల్దార్ (మండల రెవెన్యూ అధికారి) వారిచే 2023 సంవత్సరములో జారీచేసిన రూ. 5,00,000/-లకు తక్కువ కాని మొతుబరి ధ్రువపత్రం సమర్పించగలరు. సాల్వెన్సీ దాఖలు చేయని వారు షెడ్యూలు 2లో పేర్కొన్న ధరావత్తుతోపాటు అదనపు ధరావత్తుతో DD/ పే ఆర్డర్/ నగదు రూపంలో చెల్లించి పాటలో పాల్గొనవలెను. సదరు వేలంపాట ఖాయపరుచుటకు గాని లేక రద్దుపరుచుటకు గాని వాయిదా వేయుటకు గాని గ్రామ పంచాయతీ కార్యదర్శి వారికి పూర్తి అధికారం కలదు. మిగతా వివరములు కార్యాలయ పనివేళలలో తెలుసుకొనవచ్చును. నగదు రూపంలో కూడా ధరావత్తులు స్వీకరించబడును.

షెడ్యూలు - 1

వ.నెం.	టెండర్ వివరాలు	చెల్లించవలసిన ధరావత్తు
1.	1) 2024-25 సం॥లకు గ్రామంలో పారిశుధ్య పనిపాట్లు & కార్యాలయ నిర్వహణ (పనివాళ్లకు) కాంట్రాక్ట్ లేబర్ 19 మంది సప్లయి చేయుటకు 2) 2024-25 సం॥నకు మంచినీటి సరఫరా నిర్వహణ పనిపాట్లకు 5గురు సప్లయి చేయుటకు 3) 2024-25 సం॥నకు వీధి దీపములు నిర్వహణ పనిపాట్లకు 1 మనిషిని సప్లయి చేయుటకు 4) శానిటరీ మేస్త్రీ 2024-25 సం॥నకు ఒకరు	రూ॥ 1000/- (వెయ్యి రూపాయలు)
2.	పాత న్యూస్‌పేపర్ (ఒక Kg. రేటు పేర్కొనవలెను) సదరు సామగ్రి తూకం ప్రాప్తికి అప్పగించబడును.	రూ॥ 100/- లు

షెడ్యూలు - 2

	బహిరంగ వేలం వివరములు	చెల్లించవలసిన ధరావత్తు DD/ పే ఆర్డర్/ నగదు రూపంలో స్వీకరించబడును	సాల్వెన్సీ లేని వారికి అదనపు ధరావత్తు DD/ పే ఆర్డర్/ నగదు రూపంలో స్వీకరించబడును
1.	2024-25 సం॥నకు రోజువారీ సోమవారం మరియు లక్ష్మీవారం సంతలో ఆశీలు వసూలు చేసుకొనే హక్కుకు	రూ॥ 1,00,000/-లు రూపాయలు	రూ॥ 2,00,000/- రూపాయలు

షెడ్యూలు 2కి సంబంధించిన DD/ పే ఆర్డర్‌లు లేదా నగదు రూపంలో ప్రత్యేక అధికారి గ్రామ పంచాయతీ V.మాడుగుల పేరున చెల్లించగలరు. 2024 నెలలో తీసిన DDలు కానీ బ్యాంకు పే ఆర్డర్ కానీ చెల్లుబాటు కాగలదు. పై 2 షెడ్యూలులలో పేర్కొన్న టెండర్‌దారులు మరియు పాటదారులు వారివారి రేషన్ కార్డ్ ఆధార్ కార్డ్ జిరాక్స్‌లు తప్పనిసరిగా తీసుకురావలెను. 2. అసాధారణ ఖర్చులతో పనిచేసే సిబ్బందికి విధి నిర్వహణలో ఏవిధమైన హాని జరిగినను దానికి గ్రామ పంచాయతీ ఎటువంటి బాధ్యత వహించదు. 3. షెడ్యూలు 1లో పనులకు దాఖలు కాబడిన టెండర్ మొత్తములను పంచాయతీ వారు ఖాయపరచిన పిదప శ్రీ జిల్లా కలెక్టర్ గా॥ విశాఖపట్నం వారు మంజూరు చేసిన మొత్తములను మాత్రమే వారి అనుమతి పొందిన పిదప నిధుల లభ్యతను అనుసరించి చెల్లింపులు జరుపబడును. 4. షెడ్యూలు 2లో సూచించిన వేలంపాటలో పాల్గొనదలచిన వారు శ్రీ తహశీల్దార్ వారిచే 2023 సంవత్సరంలో జారీ చేయబడిన మొతుబరి ధ్రువపత్రం మాత్రమే అంగీకరించబడును. 5. చెల్లించవలసిన ధరావత్తు అదనపు ధరావత్తులు DD/ బ్యాంకు పే ఆర్డర్/ నగదు రూపంలో ప్రత్యేక అధికారి గ్రామ పంచాయతీ V.మాడుగుల పేరుపై స్వీకరించబడును. 6. రోజువారి మరియు వారపు సంత వేలంలో పాల్గొనేవారు కూడా అదనపు ధరావత్తు సొమ్ము లేకుండా రూ॥ 5,00,000/-ల రూపాయలు విలువగల మొతుబరి ధ్రువపత్రం సమర్పించవలెను. 7. ఆశీలు వసూలు హక్కు పొందు గుత్తదారు వేలంపాట సొమ్ముకు ప్రభుత్వం వారు నిర్వహించిన ప్రకారం అగ్రిమెంట్ స్టాంపులు ఖరీదు చేసి షరతులతో రిజిస్టర్ అగ్రిమెంట్ పంచాయతీకి దాఖలు చేయవలెను. 8. ప్రజా ప్రతినిధులు పాటలో పాల్గొనరాదు. 9. గ్రామ పంచాయతీకి ఎటువంటి బకాయి ఉన్న పాటలో పాల్గొనుటకు అనర్హులు. 10. షెడ్యూలు 1,2లో పొందుపరచిన ఐటమ్స్ వేలం టెండర్లు వాయిదా వేయుటకు గాని, రద్దుపరుచుటకు గాని పంచాయతీ కార్యదర్శికి అధికారం కలదు. 11. మిగతా వివరాలు కార్యాలయ పనివేళలలో వివరంగా తెలుసుకోవచ్చును.

సం/- సి.హెచ్. నాయుడు, పంచాయతీ కార్యదర్శి,
గ్రామ పంచాయతీ, V.మాడుగుల. ఫోన్ : 9985762390